# తైవానుభవం

ఆస్టిన్‌నించీ డల్లాస్ మీదుగా, నేనూ డగ్ కెనడాలోని వాన్‌కూవర్ వెళ్ళి, అక్కడినించీ తైవాన్‌వారి ఈవా ఎయిర్ లైన్స్ ఎక్కి తైవాన్ రాజధాని తైపేకి బయ ల్దేరాం. వాన్‌కూవర్‌నించి అలాస్కా మీదగా వెడుతుంటే, కొంచెం తక్కువ ఎత్తులో పోనిస్తూ పైలట్ అందర్నీ ఒకసారి క్రిందకి చూడమని సలహాఇచ్చాడు. అసలే అది డిశెంబర్ నెల. అలాస్కాలో నేల, చెట్లూ, కొండలూ, సముద్రం అంతా మంచుతో దట్టంగా కప్పబడి, తెల్లగా మెరిసిపోతూవుంది. స్వచ్ఛమైన తెలుపు. బయట చీకటిని వెలుతురుగా మార్చేసిన తెలుపు. కిటికీలోనించి కళ్ళార్పకుండా మనోహర ప్రకృతి సౌందర్యాన్ని అలాగే చూస్తూ కూర్చున్నాను.

తైవాన్ చైనాకి ఆగ్నేయ దిక్కున వుంటుంది. దాదాపు 36 వేల చదరపుకి లోమీటర్ల వైశాల్యంగల ద్వీపం. ఇరవై రెండు మిలియన్ల జనాభా. చదువుకున్నవారి సంఖ్య 95 శాతం. మాట్లాడే భాష మాండరీన్, చైనీస్, తైవానీస్. చాలమంది ఇంగ్లీష్ ధారాళంగా మాట్లాడతారు. ఆర్థికంగా ఎంతో ముందుకుపోయిన దేశం. ప్రపంచం లో అత్యధిక ఎగుమతులు చేసే దేశాల్లో, తైవాన్ మొదటి పదిదేశాల్లో వుంది. విదేశీ ద్రవ్యనిధులు 2000 సంవత్సరంలోనే 110 బిలియన్ల డాలర్లు దాటాయి. సెమీకండక్ట ర్ బిజినెస్‌లో ఇప్పుడు అగ్రస్థానంలోని దేశాల జాబితాలో వుంది. రాజకీయంగా ఎన్నో దేశాల దాడిలో ముప్పతిప్పలు పడి అందర్నీ ఆశ్చర్యపరుస్తూ, చకచకా ముందుకు వెళ్ళిన దేశం.

1206 సంవత్సరంలో ఆనాటి చైనాలో భాగంగావుంది తైవాన్. పోర్చుగీస్ ఆక్రమణలో తైవాన్ పేరు ఫార్మోజా. పోర్చుగీస్ తర్వాత స్పానిష్, డచ్ ఆక్రమణలు జరిగాయి. 1644లో డచ్‌ని వెళ్ళగొట్టి మళ్ళీ చైనా ఆక్రమణ చేసింది. 1684లో ఫూజి ద్వీపం వాళ్ళు ఆక్రమించారు. 1895లో జపాన్ "షిమోనొసేకి" ఒప్పందం ప్రకారం, తర్వాతి యాభై సంవత్సరాలు తిష్ఠవేసింది. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో తైవాన్ ఈ దురాక్రమణలలో నించి బయటపడి, ఒక స్వతంత్ర దేశమ యింది. తైవాన్ ఆర్థికంగా చాల ముందుకి పోవటమే కాకుండా, ఇప్పుడు ఒక గట్టి ప్రజాస్వామ్య దేశం కూడానూ. వ్యవసాయంలో కూడా తైవాన్ ఎంతో ముందు వుంది. బియ్యం, పంచదార, టీ మొదలైన పంటలు పండించటంలో చెప్పుకోదగ్గ దేశం.

మేం ఆ ట్రిప్‌లో చూసినవవి మూడు నగరాలు. ఒకటి తైవాన్‌లోని అన్ని నగరాల్లోనూ పెద్దది, రాజధాని తైపే. రెండవది ఎన్నో పరిశ్రమలు వున్న షించూ. మూడవది దేశవిదేశాల కంపెనీలు ఎన్నో వున్న టైనాన్ నగరం. కాలుష్య పరిరక్షణ లో శుభ్రతలో వెనకబడ్డ షించూ మన బొంబేని గుర్తుచేస్తుంది. తైపే చాల ఆధునిక నగరం. ఎయిర్‌పోర్ట్ అందంగా వుంటుంది. ఊళ్ళో రోడ్లు ఎంతో వెడల్పుగానూ, శుభ్రంగానూ వుంటాయి. రాత్రి పూట రంగురంగుల లైట్లతో రాత్రంతా మేలుకుని,

మెరిసిపోతూ వుంటుంది. తైవాన్‌లో మిగతా పెద్ద నగరాల్లో రెండవది కోషింగ్. మూడవది తైచంగ్. నాలుగోది టైనాన్. ఐదోది షించూ. అన్నీ దేశవిదేశీ యాత్రికులతో కళకళలాడుతుంటాయి. టైనాన్‌లో చెప్పుకోదగ్గది కంన్ఫ్యూషియస్ గుడి. 551 బిసిలోపుట్టిన కంన్ఫ్యూషియస్‌ని అక్కడ "చదువుల సాధువు" అంటారు. రాజ సంస్థానాల్లో ఒకసలహాదారుగా పనిచేస్తూనే చదువులు చెబుతూవుండేవాడు. 3000 మంది శిష్యులదాకా ఆయన కింద వుండేవారని చెప్పారు. ఆయన నేర్పే దాంట్లో కొత్త విషయాలమీద పరిశోధనలు చేయటం, పుస్తకాలు వ్రాయటం ఎడిటింగ్ చేయటం, ధ్యాన్నం చేయటం, రాజకీయ చతురతలో నిపుణులుగా చేయటం, జీవితంలో మనుష్యుల విలువలూ నీతీ నిజాయితీ గుర్తుచేయటం మొదలైనవి ధ్యేయంగా పెట్టుకున్నాడు. ఆయన పోయిన తర్వాత ఆయనకి లభించిన పేరూ గుర్తింపూ ఆ దేశంలోనే కాక చుట్టుపక్కల దేశాలన్నిటిలోనూ ఒక విధమైన మార్పు తీసుకువచ్చిన కంన్ఫ్యూషియస్‌కి, ఆ రోజుల్లో గుర్తింపు రాలేదు. ఆయన 72వ ఏట, 479 బి.సి.లో మరణించాడు. ఆయన శిష్యులు మాత్రం ఎనలెక్ట్స్ ఆఫ్ కంన్ఫ్యూషియస్ అనే ఒక గ్రంధాన్ని వ్రాసి ఆయన చిరకాలం గుర్తుండేలా చేసారు. ఈనాడు ఎలిమెంటరీ స్కూల్ దగ్గరనించీ, డిగ్రీ కోర్సుల దాకా ఆయన చెప్పిన విషయాలనే భోధిస్తున్నారు. ఆయన పేరుతో సెప్టెంబర్ 28న టీచర్స్ డే గా గుర్తించారు. తైపేలో ఆయనకి కట్టిన గుడి చాల ప్రాచీనమైనది. ఎంతో అందంగా వుంటుంది. తైవాన్ ఒక ద్వీపం అవటం వల్ల, చుట్టూ సముద్రంతోనూ, భూభాగంలో ఎన్నో కొండలు నదులతోనూ చాల అందంగా వుంటుంది. ముఖ్యంగా చెప్పుకోదగ్గవి ఎత్తైన కొండల మధ్య వున్న డాగౌన్‌షాన్ అడవులు. రీశెర్చికి పనికివచ్చే రకరకాల చెట్లు ఒక పక్క, పళ్ళ తోటలు ఒక పక్క, పూల తోటలు ఇంకోపక్క. వాటికి దగ్గరలోనే మనమెన్నడూ చూడని రకరకాల పక్షులు. అక్కడికి వచ్చే యాత్రికుల్లో సగంమంది ఈ పక్షుల్ని చూట్టానికి వచ్చేవాళ్ళే. అలాగే అక్కడున్న వందల రకాల పురుగుల్ని చూడటానికీ ఫొటోలు తీయటానికీ ఎంతోమంది వస్తుంటారు. అక్కడే 1400 సంవత్సరాల వయసున్న ఒక పెద్ద చెట్టు. దాని ఎత్తు 41 మీటర్లు. చుట్టూ చెక్కలతో చట్రంలాగా కట్టి, దాన్ని పరిరక్షిస్తున్నారు. దానికి కొంచెం దగ్గర్లోనే 2800సంవత్సరాల వయసున్న ఇంకొక చెట్టు. ఆచెట్టు ఏ జంతువో కింద పడుకుని మూడు కాళ్ళు పైకెత్తినట్టుగా వుంటుంది దూరంనించీ చూస్తే. ఆ చెట్టుకి ఎలుగుబంటి ఇల్లు అని పేరు కూడా పెట్టారు.

మేము తైపేలోవున్న చివరి శనివారం అనుకున్న మీటింగ్ కాన్సిల్ అయింది. ఆదివారం మళ్ళీ అమెరికాకి మా తిరుగు ప్రయాణం. మా హోటల్లో రిసెప్షనిస్ట్‌ని అడిగాను దగ్గరలో చూడవలసినవి ఇంకేమైనావున్నాయా అని. ఊలాయ్ కొండల మీదకి వెళ్ళమనీ, అక్కడ ఆదివాసుల గ్రామం చూసి తిరాలనీ చెప్పింది. హోటల్‌నించే మధ్యాహ్నం బస్సుకూడా వుందని చెప్పింది. నేనూ డగ్ బస్సుకి టిక్కెట్లు రిజర్వు చేసుకుని, లంచ్ అవగానే ఊలాయ్ గ్రామానికి బయల్దేరాం.

తైపేనించీ సుందరమైన కొండలూ లోయలూ దాటుకుంటూ ఊలాయ్ చేరటానికి గంటన్నర పైనేపట్టింది. రెండు కొండల మధ్యవున్న ఎంతో లోతు లోయ మీద

కట్టిన సస్పెన్షన్ బ్రిడ్జ్ మీదనించి ఊలాయ్ గ్రామానికి వెళ్ళాం. రంగురంగుల బట్టలు వేసుకుని హడావిడిగా తిరుగుతున్నారు ఆ గ్రామీణులు. మనవేపు పెద్ద సంతలాగా వుంది అక్కడ వాతావరణం. అప్పుడే అక్కడ వెదురు బద్దలతో కట్టిన పెద్ద ఆడిటోరియంలో "షో" మొదలవుతున్నదన్నారు. నేనూ డగ్ టిక్కెట్లు కొనుక్కుని ముందు వరసలో కూర్చున్నాం.

ఆ రోజు మొత్తం పది పాటలకి డాన్సులు చేశారు. ఒక్కొక్కడాన్స్‌లోనూ కనీసం ఎనిమిదిమంది మగవాళ్ళూ. ఎనిమిదిమంది ఆడవాళ్ళూ. ఎరుపూ, ఆకుపచ్చ రంగుల పల్లెటూరి వేషధారణ. వాటిల్లో మమ్మల్ని బాగా ఆకర్షించింది ఆ డాన్సులకి ఇచ్చిన సంగీతం. సన్నటి వెదురు బొంగుల వేణువులతో వాయించిన రకారకాల పాటలు. పక్కనే కేరళలో వాయించేలాటి పెద్ద డోళ్ళు. నేల మీద ఆనించి నుంచుని వాయించే అంత ఎత్తుగా వున్నాయవి. వాళ్ళ భాషలో ఆ పాటలు పాడినా ఆ డాన్స్ చూస్తూ సంగీతం వింటుంటే అర్ధమయినట్టుగావుంది. సంగీతానికి భాష భేధాలు లేవన్న శంకరాభరణం శంకరశాస్త్రి గుర్తుకొచ్చాడు. ఆరోజు చేసిన డాన్స్‌ల్లో కొన్ని మన దంపుళ్ళ నృత్యాలు, బతకమ్మ నాట్యాలూ గుర్తుకు తెచ్చాయి. చదరంగం బోర్డులాగా అటు ఎనిమిది, ఇటు ఎనిమిది బొంగులని నేల మీద రకరకాలుగా వూపుతుంటే, వాటి పైన కాళ్ళు ఆ బొంగులకి తగలకుండా అరడజను మంది ఒకేసారి చేసిన ఆ డాన్స్ అద్భుతంగావుంది.

చివరికి స్టేజీమీదే వాళ్ళ పెళ్ళి తంతంగం ఎలా వుంటుందో చూపించారు. వెదురు బద్దలతో చేసిన లూబు అనే వాయిద్యం మీద, ఒక అబ్బాయి పాట వాయిస్తుంటాడు. అతనంటే ఇష్టమున్న అమ్మాయి డాన్సు చేస్తూ వస్తుంది. పెళ్ళికి ముందర అమ్మాయి ముఖంమీద గోరింటాకుతో అలంకరణ చేస్తారు. అతనుకూడా పెళ్ళి జరిగేలోగా వెళ్ళి ఓ ఎలుగుబంటిని చంపి రావాలి. అతనలావచ్చాక పెళ్ళి జరుగుతుంది. పెళ్ళయాక అతని వీపుకి కట్టిన ఒక పేముకుర్చీలో అమ్మాయిని కూర్చో పెట్టుకుని అతను డాన్స్‌చేసుకుంటూ, ఆ అమ్మాయిని మోసుకుంటూ వెళ్ళిపోతాడు.

షో అయాక వెడుతున్నప్పుడు, "చాల బాగుంది" అన్నాడు డగ్.

"అవును బాగుంది. సంగీతం ఇంకా బాగుంది. సీడీ దొరికితే బాగుంటుది. కొనాలి" అన్నాను. అంతలోనే ఒకావిడ మా దగ్గరికి వచ్చి ఊలాయ్ బాషలో ఏదో అంది. పక్కనవున్న అయన ఇంగ్లీష్‌లో, ఆవిడే ఆ పాటలు పాడింది అన్నాడు. నేనూ డగ్ ముఖాలు ఇంత చేసుకుని, ఆవిడకి వంగి సలామ్ కొట్టాం. మా మాటలు విన్న అతను ఆవిడతో చెప్పాడు. ఆవిడ చెరొక సీడీ ఇచ్చింది. ఇచ్చేముందర నా కోరికపై ఆటోగ్రాఫ్ కూడా చేసి ఇచ్చింది. ఆవిడకి అర్ధమయినా కాకపోయినా డగ్ మాత్రం టెక్సాస్ ఇంగ్లీష్‌లో, అతనికి ఆ పాటలు ఎంత నచ్చాయో చెప్పేస్తున్నాడు.

బస్సు వెనక్కి పోవటానికి తయారుగా వుంది.

డగ్ చేయి పట్టుకుని "పదవోయ్ చెవలాయ్" అని ఆ ఊలాయ్ ఊళ్ళోంచి బస్సులో బయట పడ్డాం.

*   *   *